క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాసెల్ల విల్లాస్, శ్రీరాంనగర్ సి బ్లాక్, వుడ్స్ విల్లాస్, అపర్ణ హైట్స్, శ్రీరాంనగర్ మెయిన్ రోడ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తగూడ విలేజ్, శ్రీరాంనగర్ ఏ,బి బ్లాక్‌లు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జర్నలిస్ట్‌కాలనీ, బ్రహ్మాన్ సదన్, ఎల్లా హోటల్, హిల్‌రిడ్జ్ విల్లాస్, గోపిచంద్‌అకాడమీ, ఎమ్మార్ ప్రాపర్టీస్ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ బ్రహ్మకుమారీస్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్కీ, జయభేరి పైన్‌వ్యాలీ, కేర్ ఆస్పత్రి ఏరియా, ఐడీబీఐ బ్యాంక్, బ్రహ్మకుమారీస్ సంస్థ, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, రాక్ ఎన్‌క్లేవ్ వంటి ప్రాంతాలలో కూడా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

నేడు 'మనూ' ఐటీఐ అడ్మిషన్ కౌన్సెలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)హైదరాబాద్‌లో ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం అడ్మిషన్ కౌన్సిలింగ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐటీఐ భవనం లో కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తామన్నారు. అందుకోసం అర్హులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వ్యక్తిగతంగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 040-23008428, సెల్ నెంబర్ 9440692452లో సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

గచ్చిబౌలి: డ్రైనేజీ, సీసీ రోడ్లను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పరిశీలించారు. గురువారం ఇందిరానగర్‌లో ఆయన పర్యటించారు. కాలనీలు, బస్తీలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సయ్యద్ నయామ్, యూసూఫ్ పాషా, గోపాల్ యాదవ్, ప్రవీణ్, అరుణ్, చారీ, వేణు, అబ్దుల్ సత్తార్, కొయ్యాడ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ శాంతి ధృవ స్థాపన దినోత్సవం

హఫీజ్‌పేట్ : నానక్‌రామ్‌గూడలోని ది శ్రీరామ్ యూనివర్సల్ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ శాంతి ధృవ స్థాపన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త, ఆర్‌సీజేహెచ్ మాజీ అధ్యక్షురాలు రోటేరియన్ ఝాన్సీ ప్రేమానంద్, అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ సురేష్ గుప్తా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, రోటేరియన్ డాక్టర్ జ్యోతి రెడ్డి, కార్యదర్శి వజ్రల రాజ గోపాల్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

పునరుత్పాదక ఇంధన వనరుల పెరుగుదలలో ప్రగతి

రాయదుర్గం: ఇంధన మిశ్రమంలో పునరుత్పాదక ఇంధన వనరుల పెరుగుదలలో ఎంతో ప్రగతి కనిపిస్తోందని పీజీసీఐఎల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో పీజీసీఐఎల్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం 'రెన్యూవబుల్ ఎనర్జీ జనరేషన్-గ్రిడ్ ఇంటిగ్రేషన్ అంశాలు-బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌పై అనుకూలీకరణ' అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావుతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి యొక్క పెరుగుతున్న వ్యాప్తి మధ్య గ్రిడ్ స్థిరత్వం యొక్క ఒత్తిడి ఆందోళనను కలిగిస్తోందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ అన్ని సంస్థల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను అందించడంలో ఎస్కీ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు.

వృద్ధుడి అదృశ్యం



గచ్చిబౌలి: చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మసీద్‌బండలో నివాసం ఉంటున్న నక్క లక్ష్మణ్(55) ఈ నెల 16న ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో సమీప ప్రాంతాలలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కొడుకు రమేష్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భళా.. బిహార్ మేళా



శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ కనెక్ట్ మేళాలో ఆకట్టుకుంటున్న స్టాల్స్ లెదర్, జూట్, స్టోన్ కార్వింగ్ ఉత్పత్తులు

- శిల్పారామంలో ఆకట్టుకుంటున్న బిహార్ చేనేత హస్తకళా మేళా
- ఈనెల 25 వరకు కొనసాగనున్న మేళా
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న స్టోన్, ఉడ్ కార్వింగ్ ఉత్పత్తులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ చేనేత హస్తకళా మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. బిహార్ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఉపేంద్ర మహారథి శిల్ప అనుసంధాన్ సంస్థాన్ బిహార్ రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బిహార్ కనెక్ట్ 2023 పేరిట ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శన ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



◆ కళాకారులు తయారు చేసిన మధుబని పెయింటింగ్ చీరలు, ఖాదీ షర్టులు, జూట్ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

◆ బగల్‌పురి చీరలు, ఖేతా ఎంబ్రాయిడరీ, స్టోన్ కార్వింగ్, బ్లాక్ ప్రింటింగ్, సిక్కిఆర్ట్, నలంద లాక్ బ్యాంగిల్స్, చెక్కక్రాఫ్ట్, టికులీ పెయింటింగ్, మంజూషా పెయింటింగ్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

మేళాలో భాగంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు....

మేళాలో బాగంగా సందర్శకులను ఆకట్టుకునేందుకు ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు అంఫిథియోటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, సంగీత కచేరాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ నృత్యాలతో సందర్శకులను అలరిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న మధుబని పెయింటింగ్ జూట్ ఉత్పత్తులు...

మేళాలో ఏర్పాటు చేసిన జూట్ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రత్యేకంగా జూట్ బ్యాగులపై మధుబని పెయింటింగ్ వేసి ఆకట్టుకుంటున్నారు. కళాకారులు, మహిళల కోసం హ్యాండ్ బ్యాగులు, ల్యాప్‌టాప్ బ్యాగులు, స్కూల్ బ్యాగ్స్, ఫైల్ చేసేందుకు ఉపయోగించే బ్యాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. వీటి ధర రూ.100 నుంచి 3వేల వరకు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న స్టోన్, వుడ్ కార్వింగ్ విగ్రహాలు

కళాకారులు తయారు చేసిన ఉడ్ కార్వింగ్, స్టోన్ కార్వింగ్ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆరు అంగుళాల, ఫీట్ కార్వింగ్ విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఆర్డర్‌పై ఎంతపెద్ద విగ్రహాలను అయిన తయారు చేస్తామని కళాకారులు తెలుపుతున్నారు. వీటి ధర రూ.150 రూపాయల నుంచి 3వేల వరకు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువ శాతం నల్లరాతితో విగ్రహాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. శివలింగాలు, గణేశ్, హనుమాన్, బుద్ధ విగ్రహాలు తదితర దేవీదేవతా మూర్తుల విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి.

ఆకర్షణగా నిలుస్తున్న లేదర్ బ్యాగ్స్

కళాకారులు తయారు చేసిన లేదర్‌బ్యాగ్స్ ఆకర్షణగా నిలుస్తున్నాయి. మహిళలకు కావాల్సిన వివిధ రకాల బ్యాగ్స్, పెయింటింగ్ బ్యాగ్స్, స్కూల్ బ్యాగ్స్, ల్యాప్‌టాప్ బ్యాగ్స్ వివిధ రకాల డిజైన్‌లతో అందుబాటులో ఉన్నాయి.



మేళాలో ఆకట్టుకుంటున్న మధుబని పెయింటింగ్స్, ఇత్తడితో చేసిన దేవతామూర్తుల విగ్రహాలు, కొనుగోలు చేస్తున్న సందర్శకులు

500 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూంల పంపిణీ



డబుల్ బెడ్ రూమ్ పత్రాలను అందిస్తున్న మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: రెండో విడతలో శేరిలింగంపల్లికి చెందిన 500 మంది అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూంల పంపిణీ చేసినట్లు ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని కొల్లూరులో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా డబుల్ బెడ్ రూంలను పంపిణీ చేశారు. పేదల సొంతింటి కలను నిజం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగు నీరు తదితర సౌకర్యాలను కల్పించామని చెప్పారు. పేదవారు ఆత్మ గౌరవంతో బతకాలనే ఉద్దేశ్యంతోనే లాటరీ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాదారం రంగారావు, ఆదర్శ్ రెడ్డి,ఎర్రగుడ్ల శ్రీనివాస్, ప్రసాద్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు కార్పొరేటర్ అభినందనలు



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సత్కరిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : పార్లమెంట్‌లో మహిళ బిల్లు ప్రవేశపెట్టడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి ఎమ్మెల్సీ కవిత పోరాటం చేస్తున్న సందర్భంగా బుధవారం పార్లమెంట్‌లో మహిళ బిల్లును ప్రవేశపెట్టడం అది ఆమోదించారన్నారు. ఆమె పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళ బిల్లు పెట్టిందన్నారు. ఎమ్మెల్సీ కవితను కలిసిన వారిలో వివేకానందనగర్ కార్పొరేటర్ రోజా రంగారావు ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన త్వరగతిన పూర్తి చేయండి



బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహిస్తున్న ఉపకమిషనర్ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో ఉపకమిషనర్ వంశీకృష్ణ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీ వరకు నూతన ఓటు, మార్పుల చేర్పులపై దరఖాస్తుల విచారణ గడువు ముగిసిందన్నారు. బీఎల్‌ఓలు త్వరతగతిన ఫాం 6,7,8 దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఓటర్ జాబితాలో చనిపోయిన పేర్లను కూడా పరిశీలించి వాటిని కూడా తొలగించాలన్నారు. అంతే కాకుండా వారి ఆధార్ కార్డు పరిశీలన చేయాలన్నారు. త్వరలోనే తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ సురేష్, సూపరిటెండెంట్ విజయ్‌కుమార్, బీఎల్‌వో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవ సంబంధాల ఔన్నత్యమే గురజాడ సాహిత్యం

హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: మానవ సంబంధాలను సూటిగా, శక్తివంతంగా చెప్పడంలో గురజాడ అప్పారావు విజయవంతం అయ్యారని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని తెలుగుశాఖ, గురజాడ ఫౌండేషన్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించే 'మహాకవి గురజాడ అప్పారావు జీవితం, రచనలు' పేరిట నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గురజాడ దేశమంటే కేవలం మట్టిమాత్రమేకాదనీ, దేశమంటే మనుషులు కూడా అనే దృష్టితో మానవత్వ పతాకాన్ని ఆవిష్కరించారన్నారు. సులభమైన మాటల్లో సూటిగా చెప్పడం గురజాడ అప్పారావు శైలి ప్రత్యేకత అని, పాఠశాలలో చదువుకున్నప్పుడే గురజాడ వారి దేశభక్తి గేయం గుండెల్లో సూటిగా దూసుకుపోయిందన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు తరాల వారు ఈ సదస్సులో పాల్గొంటున్నారని గుర్తు చేశారు. యువతకు అధిక ప్రాధాన్యతనిస్తూ సదస్సును నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆచార్య ఏల్చూరి మురళీధరరావు మాట్లాడుతూ గురజాడ రచనలపై వాద వివాదాలు, విమర్శలు ఉన్నప్పటికీ కులం, మత, ప్రాంతాలకు అతీతంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురజాడఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ గురజాడ వారి జయంతులు, వర్ధంతులు జరుపుకోవడమే కాకుండా వారి ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. గురజాడ కథామంజలి పుస్తకం దార్ల వెంకటేశ్వరరావు నెమలికన్నులు గ్రంథాల్ని ఆవిష్కరించారు. గురజాడ సాహిత్యంపై విశేషంగా కృషి చేసిన సంధ్యారాణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రోవీసీ ఆచార్య ఆర్ఎస్ సర్రాజు, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్‌డీన్ ఆచార్య వి కృష్ణ, ఆచార్యులు రెడ్డి శ్యామల పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ఎల్‌డీఎఫ్ ఇండియా ప్రారంభం



ఎల్‌డీఎఫ్ ఇండియా ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న డాక్టర్ తరుణ్‌శ్రీధర్ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎల్‌డిఎఫ్ ఇండియా (లైవ్‌స్టాక్, డెయిరీ, ఫిషరీస్) ఎక్స్‌పో 2023 ప్రారంభమైంది. మాజీ యూనియన్ సెక్రటరీ ఏహెచ్‌డీ డాక్టర్ తరుణ్ శ్రీధర్, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సీనియర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.నరసింహమూర్తి, నాబార్డ్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల, ఐఈడీఎస్ అదనపు అభివృద్ధి కమిషనర్ డి.చంద్రశేఖర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్‌శ్రీధర్ మాట్లాడుతూ పశు సంపద వ్యవసాయం ఉపసంపదగానే ఉందన్నారు. ఎక్స్‌పోలో దాదాపు 80 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భారతదేశం గణనీయంగా పశుసంపదను కలిగివుందన్నారు. ప్రపంచ చేపల ఉత్పత్తిలో ప్రధానమైనదని తెలిపారు. ప్రపంచ పాల ఉత్పత్తి, వినియోగంలో ముందుందన్నారు. పశువుల రంగం ఆర్థిక వ్యవస్థలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం అన్నారు. ఇది 8.5శాతం వృద్ధిని నమోదు చేసినట్టు తెలిపారు. ఇది తయారీ, సేవల రంగంకంటే ఎక్కువ అని తెలిపారు. ఎన్ఎఫ్‌డీబీ (జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు) చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.నరసింహమూర్తి తదితరులు మాట్లాడారు.



శేరిలింగంపల్లిలో..



ఖాజాగూడలో..

ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమాలు

శేరిలింగంపల్లిజోన్ బృందం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో గణేష్ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తూ పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో గణేష్ మండపాల వద్ద కొలువుదీరిని గణేషులను భక్తులు దర్శించుకుంటున్నారు.



చందానగర్‌లో..



ఎంజీ ఎర్త్ మూవర్స్‌లో...

'మనూ'లో ఎంటెక్, యూజీ-సీయూఈటీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ళ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం సీయూఈటీలో అర్హత సాధించిన అర్హతగల అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. ముఖ్యంగా బీఏ, బీఏ(జేఎంసీ) బీకామ్, బీఎస్సీ కోర్సులతోపాటు ఎంటెక్, సీఎస్ఈ(ఏఐ, ఎంఎల్) వంటి కోర్సులకు ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా యూనివర్సిటీలో స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో పార్ట్‌టైమ్ ప్రోగ్రామ్‌ల కోసం ఆన్‌లైన్ పోర్టల్ ఈనెల 23, 24 తేదీలలో ఓపన్ అవుతుందన్నారు. ఇప్పటికే 'మనూ'ను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు, ఎంచుకోవడంలో విఫలమైన, అర్హత సాధించని, సీయూఈటీలో ఉర్దూను లాంగ్వేజ్ అప్షన్‌గా ఎంచుకోని అభ్యర్థులు ఉర్దూగా చదివి ఉంటే కూడా యూజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పది లేదా ప్లస్ టూ స్థాయిలో భాష లేదా బోధనా మాధ్యమం ఉర్దూ తప్పనిసరిగా ఉండాలన్నారు. 22 నుంచి 24వ తేదీ వరకు వివిధ మెరిట్ బేస్డ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులు, టీచింగ్ ఇంగ్లీష్‌లో పీజీ డిప్లొమోలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

హెచ్‌సీయూలో ముగిసిన విజ్ఞానోత్సవ్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్ (సీఐఎస్)తో అనుబంధంగా ఉన్న జూనియర్ సైన్స్ క్లబ్ (జేఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సైన్‌ఫెస్ట్-విజ్ఞానోత్సవ్-2023 ముగిసింది. కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ గ్రాంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ నిధులను సమకూర్చాయి. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, సీఐఎస్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌సుబోధ్, జేఎస్సీ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె మురళీధరన్,ఐఈఓ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం



యూజీడీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలో నూతనంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం అవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం రూ.50 లక్షల నిధులతో యూజీడీ పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, జలమండలి అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలలో యూజీడీ పైప్‌లైన్ లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నూతనంగా పైప్‌లైన్ నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ పూర్ణేశ్వరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



గచ్చిబౌలి: సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని యూత్ క్యాన్ లీడ్ చైర్మెన్ సాయిరాం యాదవ్ పేర్కొన్నారు. గురువారం సిద్ధిఖీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ చేశారు. రఘునాథ్ ఫౌండేషన్ ద్వార విద్య, ఆరోగ్యం కోసం సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భరత్ యాదవ్, రాజేష్‌యాదవ్, లక్ష్మీబాయి, గాల్ రెడ్డి, రాంచందర్, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ కనెక్ట్ 2023 మేళాలలో భాగంగా గురువారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సునీతా దివాకరుని, స్వాతీ పెండ్కర్, ప్రణీత సాయి, లక్ష్మీ, లాస్య కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. ఇందులో గణేశకౌతం, తరంగం, బృందావన నిలయే జావళీ, దరువు తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు.



ఫ్లెక్సీలో ఫొటో లేదని బ్యానర్లు కాల్చేశాడు

హఫీజ్‌పేట్ : ఫ్లెక్సీ బ్యానర్లలో తన ఫోటో వేయలేదని పెట్రోల్ పోసి నిప్పు అంటించి కాల్చివేసిన వ్యక్తిపై, కేసును పక్కదోవ పట్టించిన మహిళపై చందానగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ పాలవెల్లి వివరాలు తెలియజేశారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన బీజేపీ నాయకురాలు కాంచన కృష్ణ (59) వినాయక చవితి పండుగను పురస్కరించుకొని కాలనీలో ఈ నెల 19న భారీగా రెండు ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేశారు. అదే కాలనీకి చెందిన బీజేపీ నాయకుడు సూర్ల రాజు (34) ఫ్లెక్సీ బ్యానర్లలో తన ఫోటో లేదని గుర్తించి కాంచన కృష్ణను తన ఫోటో ఎందుకు వేయలేదంటూ నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైనా రాజు పెట్రోల్ పోసి నిప్పటించాడు. దీంతో పోలీసులు విచారణ జరిపారు. ఫ్లెక్సీలను ఎవరు తగలబెట్టారో తమకు తెలియదని కాంచన కృష్ణ కూడా పోలీసులకు వెల్లడించారు. అయితే పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా బ్యానర్లు కాల్చింది బీజేపీ నాయకులు రాజు అని గుర్తించారు. దీంతో రాజుతోపాటు కేసును పక్కదోవ పట్టించిన మహిళ కాంచన కృష్ణపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అదేవిధంగా విద్యార్థి బన్ని జిల్లాస్థాయి కుస్తీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. త్వరలో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో బన్ని పాల్గొంటాడని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

జానయ్యకు డాక్టరేట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత విభాగం అధ్యాపకులుగా పనిచేస్తున్న సీహెచ్.జానయ్యకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్‌రేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్, అధ్యాపకుల బృందం ఆయనను ఘనంగా సన్మానించింది. గణిత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏ న్యూమారికల్ స్టడీ అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకుగాను ఆయనకు డాక్టర్‌రేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళి, భిక్షపతి, మోహన్, వరలక్ష్మి, జ్యోతి, నరసింహులు పాల్గొన్నారు.